

శోభాయాత్ర సాగే మార్గంలోని సిద్ధిఅంబర్‌బజార్‌లో ఓ ప్రార్థన మందిరానికి పరదాలు కప్పిన దృశ్యం


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, బుధవారం 17 ఏప్రిల్ 2024 | HYDERABAD




కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు

## నేడు శ్రీరామ నవమి శోభాయాత్ర

### సీతారాంబాగ్ టూ సుల్తాన్‌బజార్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్: నేడు నగరంలో జరిగే శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా గోషామహల్, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం సీతారాంబాగ్ ఆలయం వద్ద శోభయాత్ర ప్రారంభమై..సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయమశాల వరకు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ వెల్లడించారు. కాగా, శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా నగరంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో పాటు యాత్ర జరిగే ప్రధాన మార్గాల్లో ఉండే ప్రార్థన మందిరాలు బయటకు కనిపించకుండా పరదాలతో మూసేశారు. మత పరమైన ఇబ్బందులు ఏర్పడకుండా పండుగల సందర్భంగా ఇలాంటి ముందస్తు చర్యలు తీసుకుంటుంటారు.

### భక్తులు పెద్దఎత్తున హాజరుకావాలి

శ్రీరామ నవమి శోభాయాత్రను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ యాత్రకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠి పిలుపునిచ్చారు.

### రేపటి నుంచి 'చిలుకూరు' బ్రహ్మోత్సవాలు

**మొయినాబాద్:** చిలుకూరు బాలాజీ ఆలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. బాలాజీ బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది శ్రీరామ నవమి మరుసటి రోజు నుంచి ప్రారంభిస్తారు. గురువారం నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు అర్చకులు రంగరాజన్ తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్

## ముప్పు తప్పించేలా.. ముందస్తు ప్రణాళిక

### జూన్ మొదటి వారం నాటికల్లా నాలా పనులు పూర్తవ్వాలి

### మాన్‌సూన్ ముందస్తు ఏర్పాట్లపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ సమీక్ష

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : రానున్న వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిలతో కలిసి జీహెచ్ఎంసీ పరిధిలో మాన్‌సూన్ ముందస్తు ఏర్పాట్లపై ఈఎన్‌సీ, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలు తదితరులతో దానకిశోర్ సమీక్షించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికలతో పూర్తి పటిష్టమైన చర్యలు చేపట్టాలని దానకిశోర్ సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) అన్ని వేళలా అప్రమత్తమై సిద్ధంగా ఉండాలని, వరద ముంపునకు చేపట్టిన పనులు 52 శాతం పూర్తయ్యాయని, మిగిలిన అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ మొదటి వారంలోగా నాలాలన్నింటినీ శుభ్రం చేయాలన్నారు. 1304 కి.మీ పొడవు నాలాలు ఉన్నాయని, భద్రత చర్యల్లో భాగంగా నాలా ఆడిట్ చర్యలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దానకిశోర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్‌సీ జియాఉద్దీన్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, బోర్కాడే హేమంత్ సహదేవ్ రావు, స్నేహ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్, చిత్రంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

# 45.70 లక్షల ఓటర్లు.. 3986 పోలింగ్‌స్టేషన్లు

### 18న నోటిఫికేషన్.. అదే రోజు నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ

- 29న ఉపసంహరణకు చివరి గడువు
- అభ్యర్థితో పాటు ఐదుగురికే అనుమతి
- వంద మీటర్ల దూరంలో వాహనాలు
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల శిక్షణకు హాజరుకాని సిబ్బందిపై ఎఫ్ఐఆర్
- ఓటింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్ రాస్ వెల్లడి

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడారు. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నామని, ఆ రోజు నుంచే నామినేషన్లను స్వీకరిస్తామని వెల్లడించారు. ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అని చెప్పారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థితో పాటు ఐదుగురు మాత్రమే నామినేషన్‌కు అనుమతి అని, వంద మీటర్ల దూరంలో వాహనాలను నిలపాలని చెప్పారు.

### శిక్షణకు హాజరుకాని వారిపై చర్యలు

జిల్లాలో 45.70 లక్షల ఓటర్లు ఉన్నారని, 3986 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కమిషనర్ వెల్లడించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3927 పోలింగ్ కేంద్రాలు, సైబరాబాద్‌లో 54, రాచకొండ పరిధిలో 5 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ఈ నెల 23, 24వ తేదీల్లో సెంట్రల్ అబ్జర్వర్లు నగరానికి వస్తారని తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్లపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణను ఇచ్చామని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 23,500 మంది సిబ్బందిని నియమించారని, శిక్షణ కార్యక్రమం సందర్భంగా పీవో, ఏపీవోలు 1700 మంది, మైక్రో అబ్జర్వర్లు 120 మంది ఇతర సిబ్బంది రెండు వేల మంది శిక్షణకు హాజరు కాలేదని, వారికి రెండు సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. వారిపై త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు ఇతర చర్యలు తీసుకుంటామని రోనాల్డ్ రాస్ హెచ్చరించారు. జిల్లాలో పట్టుకున్న నగదుకు సంబంధించి జిల్లా గ్రీవెన్స్ కమిటీలో ఆధారాలు అందజేసిన 24 గంటల్లో విడుదల చేస్తున్నామని, ఇప్పటి వరకు 73 కేసులకు గానూ రూ.2.39 కోట్లు విడుదలకు అభ్యర్థించగా, అందులో 70 కేసుల్లో రూ.1.70కోట్లు విడుదల చేశామన్నారు. ఇప్పటి వరకు ఎంసీసీలో మూడు కేసులు నమోదయ్యాయని, కోడ్ ఉల్లంఘన కు పాల్పడిన 265 మంది అరెస్టయ్యారన్నారు. బోగస్ ఓట్లపై దృష్టి పెట్టామని, వీటిపై ఈసీఐకి నివేదిక అందజేశామని రోనాల్డ్ రాస్ తెలిపారు.

### ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు

ఈ సారి ఓటింగ్ శాతం పెరిగేలా విస్తృతంగా వివిధ స్వీప్ కార్యక్రమాలు చేస్తున్నామని, ప్రత్యేకించి ఓటర్లు ఓటు వేసేలా చైతన్య పరచడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఓటర్లను చైతన్య పరిచేలా రూపొందించిన 10 బెస్ట్ వీడియోలకు అవార్డులు ఇవ్వనున్నట్లు రోనాల్డ్‌రోస్ ప్రకటించారు. ఓటింగ్ శాతం తగ్గడానికి గల కారణాలు తెలుసుకునేందుకు 75 పోలింగ్ స్టేషన్ పరిధిలో సర్వే చేపట్టామన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ పాటిల్, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

### 144 సెక్షన్..

లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుండటంతో నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.

## పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తాం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



బండ్లగూడ, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 29,28,186 ఓట్లు ఉన్నాయని, మరిన్ని ఓట్లు నమోదైయ్యే అవకాశం ఉందన్నారు. మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2877 పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## కాంగ్రెస్, బీజేపీ.. దొందు దొందే

### నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలి

### కంటోన్మెంట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తలసాని, మల్లారెడ్డి, మర్రి

కంటోన్మెంట్, ఏప్రిల్ 16:కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నీటి ఎద్దడితో కంటోన్మెంట్‌లో జనం అవస్థలు పడుతున్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా నివేదితను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ నెల 19న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నివేదిత నామినేషన్ వేస్తారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఎలాంటి లాభం లేదని, దొందు దొందేనని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తేనే కంటోన్మెంట్ అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఏకగ్రీవానికి ఇతర పార్టీలు సహకరించాలని కోరారు. కంటోన్మెంట్‌లో సొంతిల్లు కూడా లేకుండా అతి సాధారణ జీవితం గడుపుతున్న సాయన్న కుటుంబానికి అందరూ అండగా నిలవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రూప, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ దుకాణంలో ఇస్త్రీ చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## అవకాశం కల్పిస్తే..ఢిల్లీలో గళం వినిపిస్తా

### సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్16: ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, వంటి అనేక సంక్షేమ పథకాలతో కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండోరోజు మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ డివిజన్‌లో పద్మారావు గౌడ్.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పేద ప్రజలు, రైతుల పక్షాన ఢిల్లీలో తెలంగాణ గళం వినిపించేందుకు ఈ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

## కాంగ్రెస్ పోటీయే కాదు..

### మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి

ఉప్పల్: మల్కాజిగిరిలో కాంగ్రెస్ మాకు పోటీయే కాదని, బీజేపీకి గెలిచే సత్తాలేదని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్, నాచారం డివిజన్ల సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలకు సేవచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి గడపను తట్టి, ఓటరును కలుస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన స్ఫూర్తితోనే ఎంపీ ఎన్నికల్లోనూ పనిచేయాలన్నారు.కాంగ్రెస్ నెరవేర్చాలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఉప్పల్ ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్‌పాషా అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్, నేతలు ముత్యంరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం వద్దు

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ సుదర్శన్ రెడ్డి మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో డివిజన్ల వారీగా ట్యాంకర్ల బుకింగ్స్, డెలివరీ, పెండెన్సీ, పర్యవేక్షణ, అదనపు ట్యాంకర్లు, రాత్రి వేళల్లో సరఫరా చేసే ట్రిప్పులు, నీటి సరఫరా, అదనపు జలాల కేటాయింపు తదితర అంశాలపై ఎండీ సమీక్షించారు. డివిజన్ల వారీగా వివరాల్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ల ట్రిప్పులు, నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలపై ఆరా తీశారు. నీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం లేకుండా చూడాలని, ఒకవేళ ఆలస్యమైతే వినియోగదారులకు సందేశం పంపించాలన్నారు. అంతకు ముందు ఎండీ సుదర్శన్ రెడ్డి నారాయణగూడ, చిలకలగూడలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించారు. లాగ్‌బుక్స్, నీటి సరఫరా వివరాల్ని అడిగి తెలుసుకున్నారు.

# దానం నజరానా నిజమే!

### ఆక్రమణలను గుర్తించి, నిర్ధారించిన రెవెన్యూ అధికారులు

### నాగేందర్ ఇంటి వెనకాల ఉన్న సర్కారు స్థలం స్వాధీనం

### దానం వేసిన రేకుల షెడ్డు, సామగ్రి తొలగింపు.. కలెక్టర్‌కు నివేదిక

బంజారాహిల్స్, ఏప్రిల్ 16: బంజారాహిల్స్‌లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ 'నజరానా' నిజమేనని తేలింది. తానేదో ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతున్నానంటూ ఏకంగా రేకుల షెడ్లతో ఆక్రమించి.. బుకాయించినా.. ఆక్రమణ నిజమేనని రుజువైంది. దానం నజరానా నిజమేనని షేక్‌పేట రెవెన్యూ యంత్రాంగం మంగళవారం తేల్చేసింది. ఈ మేరకు షెడ్లను, అందులో దానం నాగేందర్‌కు సంబంధించి ఉన్న సామగ్రిని తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లో దానం నాగేందర్ నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వెనకాల ఉన్న 700 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు ఇటీవల 'ఫిరాయింపునకు నజరానా' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు తాజాగా ఆక్రమణల్ని తొలగించి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు.

### ఆక్రమణలను తొలగించి.. స్థలం స్వాధీనం

షేక్‌పేట మండలం సర్వే నంబర్. 403లోని టీఎస్ నం. 4/1/1/ సీ, బ్లాక్ –డీ లోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని కంగారూ స్కూల్ ఎదురుగా సుమారు 3050 గజాల ప్రభుత్వ స్థలాన్ని మూడేళ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రముఖ సినీ రచయిత డా. సీ నారాయణ్‌రెడ్డి పేరుతో భవన్ నిర్మాణం కోసం బాషా సాంస్కృతికశాఖకు కేటాయించింది. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన సైతం చేసినా.. వివిధ కారణాలతో భవన నిర్మాణం ప్రారంభం కాలేదు. ఈ స్థలం వెనకాల సుమారు 400 గజాల ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. కాగా, సినారే భవన్‌కు, ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసానికి మధ్య సుమారు 30 ఫీట్ల వెడల్పుతో సుమారు 200 ఫీట్ల పొడవుతో అప్రోచ్ రోడ్డు ఉంది. ఈ రహదారి నుంచే వెనకాల ఉన్న 400 గజాల స్థలంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ రోడ్డుకు రెండు వైపులా ఇటీవల ఎమ్మెల్యే దానం నాగేందర్ బ్లూ షీట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఏకంగా సినారే భవన్ వైపు సిమెంట్ బ్రిక్స్‌తో గోడ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. తన ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండటంతో నిర్మాణ సామగ్రి, ఇతర వస్తువులు పెట్టేందుకు రోడ్డుకు రెండువైపులా బ్లూషీట్లు ఏర్పాటు చేశానని, నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత వాటిని తొలగిస్తానంటూ నెలరోజులుగా ఎమ్మెల్యే దానం నాగేందర్ చెబుతూ.. వస్తున్నారు. అయితే నెలరోజులు దాటినా.. వాటిని తొలగించకపోవడంతో పాటు ఈ వ్యవహారంపై మీడియాలో కేటీఆర్ వ్యాఖ్యలతో రంగంలోకి దిగిన షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బ్లూ షీట్లను తొలగించడంతో పాటు సర్వెంట్స్ కోసం ఏర్పాటు చేసిన షెడ్లను కూల్చేశారు. సుమారు 750 గజాల స్థలంలో పెట్టిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు చెందిన సామగ్రిని ఆయన ఇంట్లోకి పంపించే శారు. ఆక్రమణలను తొలగించి రోడ్డు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించామని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు.



ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనకాల ఆక్రమణలను నిర్ధారించేందుకు సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది